వేలికేస్తే కాలికి
కాలికేస్తే వేలికి
వేసే ఆయన
ఏం చేసాడు?

కె.ఆర్.కె
మోహన్
కథ

# సాలెగూడు

దయానిధి నాకు చిన్ననాటి క్లాస్‌మేట్. వంశ పారంపర్యంగా వస్తున్న వ్యాపారంలో అతను స్థిరపడడం, అదే ఊళ్ళో నేను హైస్కూల్‌లో మాస్టరీ ఉద్యోగం వెలగబెడుతుండడంతో ఇద్దరికీ ఊరుదాటి బయటకు పోవాల్సిన అవసరం కలగలేదు. నిజానికి దయానిధి చదివింది ఎస్సెల్సీవరకే, అయితేనేం... తండ్రి మూడు పూవులుగా అప్పజెప్పిన వ్యాపారాన్ని ఆరుకాయలుగా మార్చగలిగాడు. ఈనాడు అతనికి ఊరిలో రెండు మేడలు, ఒక రైస్‌మిల్, కారు, బయట పొలాలు, తోటలు, ఇతర ఆస్తులు ఎన్నో ఉన్నాయి. ఇంట్లోని ఆడవారికి మోయలేనంత జవహరీ, అది చూస్తే లక్ష్మీదేవిని తీసుకువచ్చి వాళ్ళింట్లో కట్టిపడేసాడా అనిపిస్తుంది. ఎంత హీనపక్షంగా చూసినా అతని ఆస్తి కనీసం పది లక్షలకుపైనే ఉంటుంది. నేనూ ఉన్నాను ఎందుకు పేరుకి. అతనికంటె ఎక్కువే చదివాను. బిఎస్సీ. నెలనెలా వచ్చే గొర్రెతోక జీతంతో జీవితం వెళ్ళమారుస్తున్నాను. దయానిధి పై చదువులు చదవలేకకాదు. అవి అతనికి అనవసరం. అతని వ్యాపారానికి ఆ ఎస్సెల్సీ చాలు. నేను ఈ బడిపంతులు ఉద్యోగం చేయాలంటే కనీసం ఒక డిగ్రీ అయినా ఉండాలి. అందుకే చదువులో నాది పైచేయి అయినా ఆస్తిలో అతనిదే పై అంతస్థు. దయానిధి అంతటి ఆస్తిపరుడైనా నామీద అభిమానం మాత్రం పోలేదు. ఎక్కడ కనిపించినా ప్రాణమిస్తూ మాట్లాడేవాడు. అతని అంతస్థునిబట్టి 'ఏమండీ, మీరు' అని పలకరిస్తే ఒప్పుకునేవాడు కాదు. మీదపడి కరిచేటంత



పని చేసేవాడు. "నువ్వు నన్ను మీరు అనడమేమిటి నువ్వు అనాలి ఇంకా మాట్లాడితే ఏరా అనాలి" అని కోప్పడేవాడు. ఎప్పుడు వాళ్ళ ఇంటికి వెళ్ళినా ఇంట్లో చేసిన మిఠాయిలు, ఫలహారాలు ఎంతో ప్రేమతో పెట్టించి దగ్గరుండి తినిపించేవాడు. డబ్బు అతన్ని కనీసం నా విషయంలో మార్చనందుకు ఎంతో సంతోషిస్తూ ఉం

టాను. అయితే అతనివల్ల ఎప్పుడూ ఏ ఉపకారమూ, ఎట్టి సహాయమూ కోరలేదు.

అనుకోకుండా మా పెద్దమ్మాయి పెళ్ళి ఖాయం అయింది. దాంతో కిందామీద పడాల్సి వచ్చింది. ఉరుకులూ పరుగులూ. ఇన్సూరెన్స్‌మీద అప్పు, పిఎఫ్ నుంచి లోన్, అక్కడ అక్కడా దాచినవీ అన్నీ పోగేసినా ఇంకా కనీసం ఐదువేలు కావాలి. ఏమి చేయడానికి పాలుపోలేదు. ఎలారా భగవంతుడా అని దిగులు పడుతున్న సమయంలో దయానిధి మనసులో మెదిలాడు. కుచేలుడు కృష్ణుని సహాయం కోరినట్టు అతన్ని అప్పు అడగాలనుకున్నాను. ఐదువేల రూపాయలు అతనికి లెక్కలోనిదికాదు. ఎప్పుడూ ఏదీ అడగనివాడిని అడిగానంటే కాదనడు. స్నేహితుడుకదా అని అతని అప్పు ఆలస్యంగా తీర్చే ఉద్దేశం నాకు లేదు. సాధ్యమైనంతవరకూ త్వరలో అంటే కొద్ది నెలల్లోనే ఎలాగైనా తీర్చివేయాలన్న దృఢ నిశ్చయంతో ఉన్నాను.

మిల్లులోకంటె ఇంట్లో అయితే తీరిగ్గా మాట్లాడవచ్చునన్న ఉద్దేశంతో ఆ రోజు పొద్దున్నే దయానిధి ఇంటికి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి అతను గుమాస్తాతో ఏదో మాట్లాడుతున్నాడు. మిల్లులో ఉండే గుమాస్తా అంత పొద్దున్నే ఇంటికి వచ్చాడేమిటా అని అనుకున్నాను. అతను దయానిధికేమిటో దుస్తులు చూపిస్తున్నాడు.

నన్ను చూడగానే దయానిధి ఆప్యాయంగా 'రా..రా..' అని పిలిచాడు. నేను కుర్చీలో కూర్చుంటుండగానే ''అమ్మాయ్... విశ్వనాథం బాబాయి వచ్చాడు. టిఫిన్ పట్రా'' అని అరిచాడు.

''ఇప్పుడెందుకు నేను ఇంట్లో కానిచ్చేవచ్చాను'' అన్నాను.

''మరోసారి టిఫిన్‌చేస్తే మరేం పొట్ట పగలదులే. నేను ఇంకా చేయలేదు. ఏదో ఆ పనిలో ఈ పనిలో హడావిడిగా ఉండిపోయాను'' అంటూ తిరిగి గుమాస్తాతో మాటల్లో పడ్డాడు.

నేను మారుమాట్లాడకుండా కూర్చున్నాను. కాదంటే ఇంతటి అభిమానం ఉన్నవాడు నా ఈ చిన్న కోరికను కాదంటాడా? అనుకుంటూ దయానిధి చేస్తున్న పనివంక చూసాను.

గుమాస్తా ఆయనకి ఒక బనీను చూపిస్తున్నాడు. అది సైనుగుడ్డతో కుట్టి ఉంది. దానిమీద ''యం.దయానిధి ధర్మం'' అని ముద్రించిఉంది.

గుమాస్తా ''దీనిని ఉతికించి చూసాను బాబుగారూ... సోడాకూడా పెట్టి ఉతికించాను. అక్షరాలు పోలేదు. ప్రింటింగ్ బాగానే వుంది. గుడ్డ చిరిగేదాకా అక్షరాలు ఎంతమాత్రం పోవు'' అన్నాడు.

''సరే మంచిది. అన్నిటికీ కొట్టేయమను'' అన్నాడు దయానిధి.

''చిత్తం'' అంటూ ఆ బనీను తీసుకుని వెళ్ళిపోయాడు గుమాస్తా.

ఇదంతా ఏమిటో అర్థంకాక విస్తుపోయి చూస్తున్నాను నేను.

''ఏమిటి ఈ హడావిడంతా?'' అని అడగబోతుండగానే నా ఆంతర్యం గ్రహించినట్టు చెప్పాడు దయానిధి .

''ఈ నెల ఇరవైన మా నాన్నగారి సంవత్సరీకాలు. ఏదో ఆయన పేరుమీద పేదలకు అన్నదానం, వస్త్రదానం చేయాలనుకుంటున్నాను'' అన్నాడు.

''ఎంతమందికేమిటి?''


''ఆ... ఓ రెండు వేలమందికి. ఏదో మన తృప్తి కోసంకాని ముష్టి వాళ్ళకందరికి దానధర్మంచేయడం
మనవల్లనవుతుందా?!''

'అంటే రెండువేల మంది ద్వారా కొన్నినెలలపాటు వాడవాడలా ఉచితంగా తన పేరు ప్రచారం వేయించుకుంటున్నాడన్న మాట. ఇటువంటి పబ్లిసిటీ స్టంట్‌లంటే నాకు పరమ అసహ్యం. చేసే దానం గుప్తంగా ఉండాలే కాని ఊరువాడా తెలిసేట్టు ఉండకూడదు. పెద్దవాళ్ళు అంటుండేవారు. కుడిచేత్తో చేసే దానం ఎడమచేతికి తెలియకుండా ఉండాలని. అందుకని వ్యంగ్యంగా ''మరి మీ నాన్నగారి పేరుకూడా వాటిమీద' ' ఫలానా గురుమూర్తిగారి స్మృత్యర్థం అని ప్రింట్ చేస్తే బాగుండేదిగా'' అన్నాను.

నా వ్యంగ్యం అతనికి అర్థం అయిందోలేదో, అర్థం అయినా అవనట్టుగా నటించాడు కాని —''నిజమేననుకో... ఇప్పటికే తడిసి మోపెడు అయింది. అయినా ఎక్కువ అక్షరాలు ఆ కాస్త గుడ్డమీద అచ్చువేస్తే ఏ పేరూ కనిపించదు. అయినా పరలోకానికి పోయిన నాన్నగారి ఆత్మకి పేదసాదలకి చేసిన దానధర్మాలు శాంతినిస్తాయికాని... ఈ పేర్లేం చేస్తాయి'' అన్నాడు.

'ఖర్చు బోలెడయిందని అంతగా ఏడ్చేటప్పుడు నీ పేరు మాత్రం వేయించుకోవడం ఎందుకూ?'అని అడిగాలనిపించింది.

దయానిధి అసాధ్యుడు. నా మనసులోని మాట చదివేసినట్టు ''అసలు నా పేరు మాత్రం వేయించడం ఎందుకు అని అనుకుంటున్నావు కదూ. నిజమే నాకూ బొత్తిగా ఇష్టంలేదు. కాని ఇంట్లో వాళ్ళ మాట అటుంచి బయటివాళ్ళు, ఆఖరికి



మా మిల్లులో వాళ్ళుకూడా మరీ మరీ బలవంతం పెట్టడంతో తప్పనిసరిగా ఒప్పుకు న్నాను. తర్వాత ఈ విషయం గురించి బాగా ఆలోచించగా దీనివల్ల నాకు ఒనగూడే ప్రయోజనాలు చాలా ఉన్నాయనిపించింది. ఈ రెండు వేలమందికే కాకుండా ఇంకా చాలామందికి దానధర్మాలు చేసినట్టు లెక్క ల్లో చూపించి ఆ ఖర్చుకి ఇన్‌కంటాక్స్ ఎగ్జంప్షన్ పొందవచ్చు. తర్వాత బనీన్ల మీద నా పేరు కనబడడంవల్ల నాకు కావాల్సినంత పబ్లిసిటీ వస్తుంది. ఈ ఊళ్ళో ఒక ధర్మాత్ముడైన ధనికుడున్న విషయం నలుగు రికీ తెలుస్తుంది. దాంతో సొసైటీలో నా పరపతి పెరుగుతుంది. పలుకుబడి గల ధనికుల్ని ఇన్‌కంటాక్స్, కమర్షియల్ టాక్స్ వంటి అధికారులు అందర్నీ వేధించినట్టు వేధించరు'' అంటూ చెప్పుకుపోసాగాడు.

దయానిధి మాటలు వింటుంటే నా తల తిరిగిపోసాగింది. అతని దూరదృష్టి, అడుగడుగునా కనిపించే అతని వ్యాపార దృష్టి, ప్రతీ దానిని లాభ నష్టాలతో బేరీజు వేసే అతని బిజినెస్ మెంటాలిటీ వీటన్నిటి కీ మనసులోనే జోహార్లర్పించాను.

అతనింకా ఏదేదో చెప్పుకుపోతుండేవాడే కాని వాళ్ళమ్మాయి మా ఇద్దరికీ టిఫిన్ తీసుకురావడంతో బ్రేక్ పడింది. అది తినడం పూర్తయ్యేసరికి కాఫీ వచ్చింది. అది తాగడం పూర్తయ్యాక 'ఆ ఏమిటి ఇలా వచ్చావు! ఏమైనా విశేషాలా'' అని అడిగాడు.

''అవును దయానిధి... మా పెద్దమ్మా యికి సంబంధం ఖాయం అయింది.''

''వెరీగుడ్ మామవి కాబోతున్నావన్న మాట. అబ్బాయిదేవూరు? ఏం చేస్తున్నాడు ''

''ఈ ఊరే... ఎల్ఐసిలో పనిచేస్తున్నా డు.

''ఇంకే నీ రొట్టె విరిగి నేతిలో పడిందన్నమాట. కట్నం ఎంతేమిటి?''

''కట్నం ఏమీ లేదు. పిల్లనచ్చి సాంప్రదా య కుటుంబమైతే చాలనుకున్నారు. రెం డూ నచ్చాయి ఒప్పేసుకున్నారు.''

''అదృష్టమంటే నీదోనేయ్ విశ్వనాథం. అక్షరంముక్క రాని వెధవకూడా వేలకు వేల కట్నాలు కావాలని పట్టుపడ్తున్న ఈ రోజు ల్లో కానీ కట్నం లేకుండా మంచి అల్లుణ్ని కొట్టేశావు. అదే మాలో అయితేనా లక్షలు లక్షలు గుమ్మరించాల్సిం దే.''

''కోట్లకి పడగలెత్తినవాడివి లక్షలు ఖర్చు పెట్టడం ఒకలెక్కకాదు.''

''అని మీరనుకుంటారు. కానీ మా లాభాలన్నీ కాగితాలమీదే. చేతిలో చెప్పుకోద గ్గ పైకం ఉండదు. అంతా రొటేషన్‌లో ఉంటుంది.''

ఇంతలో ఓ 50 ఏళ్ళు పైబడ్డ ముదుసలి వంగిపోయిన నడుంతో కర్రపట్టు కుని నడుస్తూ వచ్చాడు. ఎముకలపోగులా ఉన్న అతని శరీరాన్ని కట్టుకున్న పంచెకి ఉన్న చిరుగులు మరింత వికృతం చేస్తున్నాయి. నడవలేక నడుస్తూ నిలబడ్డా వణుకుతున్నా డు.

''బాబూ అన్నం ముద్ద తిని ఆరురోజు లైంది. కాసిని ఎంగిలి మెతుకులు ధర్మం

చెయండి బాబూ..'' అంటూ దీనంగా అరిచాడు.

''ఫో..ఫో..ఇప్పుడేంలేదు'' అని కసిరికొట్టాడు దయానిధి.

''బాబూ ఒక్క ముద్ద... కళ్ళు తిరిగిపోతున్నాయి.'' అని మళ్ళీ దీనంగా అడిగాడు వాడు.

''చెప్తుంటే నీకు కాదు. రేపు ఆదివారం పొద్దున్న పరమేశ్వరి సత్రంలో అన్నదానం చేస్తున్నాం. అక్కడికి తగలడు. ఇంత అన్నం, ఓ బనీను ఇస్తారు'' అన్నాడు దయానిధి.

అప్పటివరకూ ఈ ముసలాడు బ్రతికుంటాడా అనిపించింది నాకు.

దయానిధి ఏమి అన్నదీ వాడికి అర్థం అయినట్టు లేదు. మళ్ళీ ''అయ్యా... ఒక్కముద్ద... గుక్కెడు గంజేనా పోయండి. దమ్మ పెబువులు'' అన్నాడు.

దయానిధికి పట్టరాని కోపం వచ్చింది. దగ్గరికి పోయి వాడిని కొట్టేంత పనిచేసి కసిరికొట్టాడు.

చేసేదేంలేక ఆ ముసలాడు వణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

ఇదంతా చూసేసరికి నాకు కడుపులో చేయి పెట్టి కెలికినట్టయింది. అంతకుముందు తిన్న టిఫిన్, త్రాగిన కాఫీ వాంతి అయిపోయేట్టనిపించింది.

''వెధవలు, ఈ దేశంలో ప్రతివెధవ అడుక్కోవడం ఒక హాబీ అయిపోయింది. ఒళ్ళు వంచి పనిచేసుకుని తినలేరు'' అంటూ రుసరుసలాడుతూ వచ్చి కూర్చున్నాడు దయానిధి.

నేను వచ్చింది ఒక విధంగా అడుక్కోవడానికే అందువల్ల అతని మాటలు నన్ను కొరడాతో కొట్టినట్టనిపించాయి. నా భావాలు పైకి కనబడనీయకుండా ''నువ్వన్నది చాలామంది విషయంలో నిజమేనేమో... కానీ ఈ ముసలివాడిని చూస్తే అలా అనిపిస్తోందా... స్వాతంత్ర్యం వచ్చి నలభై ఏళ్ళు దాటినా దేశంలో దారిద్ర్యం తగ్గకపోగా ఇంకా ఇంకా పెరుగుతుండడం మన దౌర్భాగ్యం. నువ్వన్నట్టు చాలామంది ఒంట్లో ఓపిక ఉన్నవారు కూడా ముష్టెత్తుకుంటున్నమాట నిజమే కాని అందుకు వాళ్ళనీ



పూర్తిగా తప్పుపట్టలేం. మనం అనుకుంటాం కాని తగిన జీతంతో ఉద్యోగం దొరికితే ఎవరికి మాత్రం అడుక్కోవాలని ఉంటుంది?

అందరిచేత ఎంగిలి మెతుకులకన్నా ఎక్కువగా తిట్లూ చీవాట్లు తినాలని ఎవరికి అనిపిస్తుంది. అందుకే గతిలేక ముష్టెత్తుకుంటున్నారు'' అన్నాను.

''దొరక్కపోతే చస్తారు. వీళ్ళకి ఏ హిట్లర్‌లాంటివాడో ఉండాలి. కుంటాళ్ళనీ, గుడ్డాళ్ళనీ, ముసిలాళ్ళనీ జర్మనీలో కాల్చిపారేసినట్టు వీళ్ళనికూడా కాల్చేయాలి. అప్పటికి కాని దేశానికిపట్టిన దరిద్రం, జనాభా సమస్య తీరవు'' అన్నాడు సీరియస్‌గా.

అనుకోకుండా టాపిక్ చాలా సీరియస్‌గా మారేట్టయింది.

నా స్నేహితుడి పేరు దయానిధి. మాటలు చూడబోతే ఇలా ఉన్నాయి. నిజానికి వాస్తవంతో పొంతన ఉన్న పేర్లు చాలా తక్కువగా ఉంటాయి. ఎవరిదాకానో ఎందుకు? నా పేరు విశ్వనాథం. నేను విశ్వానికి కాదుకదా ఒక సొంత ఇంటికి కూడా నాథుడిని కాలేకపోయాను. చిరంజీవి అన్నపేరున్న వాడు చిన్నతనంలోనే హరీ అనడం చూస్తుంటాం. ధనగుప్తుడన్న వాడికి గుప్తదానం కాదుకదా, ఇంధనం కూడా ఉండకపోవచ్చు. సుందరి అన్న చిన్నదాని ముఖం చూస్తే వాంతిరావచ్చు. ఏది ఏమైనా అతని ప్రవర్తన చూసాక దయానిధి అంటే నాకు మనసులో చాలా అసహ్యం కలిగింది. దానిని అణుచుకుంటూ—

''అది కాదు దయానిధీ... వాడితోపాటు అరిచి నీ సమయాన్ని వృధా చేసుకునేబదులు ఓ పదిపైసలో, పావలా డబ్బులో వేసి పంపించేస్తేపోదా'' అన్నాను.

''అలా ఎంతమందికని ఇమ్మంటావు? ఒకడికి వేస్తే వాడి వెనుకాల పదిమంది వస్తారు. ముష్టివాళ్ళకి ధర్మం చేయడానికి ఇక్కడేమీ రాసులు పోసుకు కూర్చోలేదు.''

''నిజమేలే దయానిధి... మనం ఇచ్చే చిల్లర పైసలతో వాళ్ళ పొట్టేమి నిండుతుంది? ఇది ఏ ఒక్కరో పరిష్కరించగలిగిన సమస్యకాదు. ప్రభుత్వమే దీనికేదో చేయాలి''

''అలా అన్నావు బాగుంది. నిజానికి మనం వాళ్ళకి పావలా, పరకా ఇచ్చి ఎటూకాకుండా జీవచ్ఛవాల్లా ఉంచేబదులు పదిరోజులు పొట్ట మాడ్చినా ప్రాణం పోయేట్టు చేయడమే మంచిదంటాను. వాళ్ళ జీవితాలు బాగుచేయలేనపుడు అదేమంచిది.''

తరచిచూస్తే దయానిధి అన్నదానిలో నగ్నవాస్తవం కనిపిస్తుంది. కాని ఆ కటువైన మాటలు వినడానికి మనసురాక ఇంక ఆ టాపిక్ ఆపే ఉద్దేశంతో మౌనంగా ఉండిపోయాను.

నా మూడ్ అంతా చెడిపోయింది. ఇంక అతన్ని అప్పు అడగాలనిపించలేదు.

''వెళ్ళొస్తాను దయానిధి'' అంటూ లేచాను.

''బాగుంది వరస ఎందుకొచ్చినట్టు? ఎందుకెళ్తున్నట్టు? చల్లకి వచ్చి ముంత దాచినట్టు నా దగ్గర బిడియపడతావేమిటి? నాకు తెలుసు నువ్వసలే సెంటిమెంట్ ఫెలోవి. ఈ ముష్టిగోల నీ మూడ్‌ని

పాడుచేసింది అవునా? మనం థిక్‌స్కిన్ డెవలప్ చేసుకోవాలి బ్రదర్ సున్నితంగా ఉంటే బ్రతకలేం'' అన్నాడు.

చెప్పాగా... దయానిధి అసాధ్యుడని... నా మనసుని చదివినట్టు పట్టేసాడు.

లేని నవ్వు తెచ్చుకుంటూ ''అదేంలేదు దయానిధి... అమ్మాయి పెళ్ళి ఖాయం అయిందన్నానుగా... ఎంతగీకినా కనీసం ఇంకో ఐదువేలు అవసరపడేట్టుంది. సమయానికి నువ్వాదుకుంటావన్న ఆశతో వచ్చాను'' అన్నాను.

'అమ్మాయి పెళ్ళి ఎప్పుడన్నావు?''

''ఇంకా రెండు నెలలు ఉందనుకో. కానీ ఇప్పట్నించే ఏర్పాట్లన్నీ చేసుకోవాలిగా... ఇప్పుడే అక్కరలేదు. ఓ నెలరోజుల తర్వాతే నా ఫర్వాలేదు. సమయానికి వస్తుందన్న భరోసా ఉంటే ఉండే ధైర్యం వేరుగా''

''కాదు మరీ. అలాగే... చూద్దాం.''

''చూద్దాం అంటే కాదు. ఇస్తానని మాటివ్వాలి. ఆ... ఇది నేను సహాయంగా అడుగుతున్నాననుకోకు. అప్పుగానే అడుగుతున్నాను. సాధ్యమైనంత త్వరలో మాగ్జిమం ఒక ఏడాదిలోగా తీర్చేస్తా. స్నేహం స్నేహమే. వ్యవహారం వ్యవహారమే''

''భలేవాడివే... చూద్దాం అన్నానని అనుమానపడుతున్నావా... నా నోటివెంట 'చూద్దాం' అని వస్తే దాని అర్థం చేస్తాను అనే. నెలరోజులాగి కనిపించు. అలాగే సర్దుతాను. ఆ... మరోమాట అప్పుగా ఇయ్యమన్నావు... నీకూ నాకూ మధ్య అప్పులు, రుణాలు ఏమిటి? నా చిన్ననాటి స్నేహితుడివి. అందులోనూ ఎప్పుడూ ఏదీ అడగనివాడివి. ఈ మాత్రం ఇస్తే తప్పేమీ లేదు. నా సంపదేమీ కరిగిపోదు. ఈ చిన్నదానికి సహాయం అని పెద్దపేరు పెట్టవద్దు. ముందు నీ అవసరం తీరడం ముఖ్యం. అప్పులో—సహాయాలో అవన్నీ తర్వాత చూసుకుందాం'' అన్నాడు దయానిధి.

ఆ పిసినారి చిన్నగుండెలో ఇంత పెద్ద స్థానం ఉన్నందుకు ఎంతో ఆనందంవేసింది.



ఏనుగెక్కినంత సంబరం కలిగింది. కనీసం నా విషయంలో పిసినారితనం చూపనందుకు ఎంతో సంతోషించాను. థాంక్స్ చెప్పి సెలవు తీసుకున్నాను.

నెలరోజులు గడిచింది. పెళ్ళి ఇంకో నెలలోకి వచ్చింది. ఇదే నేను చేసే మొదటి శుభకార్యమేమో ప్రతిదానికీ నానా హడావుడీ పడుతున్నాను. అన్నిటికీ నేను ఒక్కడినే తిరగవలసి వస్తుండడంతో ఎంతో అవస్థ అవుతోంది. ప్రతీదానికీ ఖంగారు పడిపోతున్నాను. పెళ్ళి ఏ ఇబ్బందీలేకుండా సలక్షణంగా పూర్తికావాలని వేయి దేముళ్ళకి మొక్కుకుంటున్నాను. వరుని తరఫువాళ్లు మంచి సంస్కారవంతులు. అటువంటివారికి ఏ ఇబ్బందీ కలగకూడదని ఆశ. కట్నకానుకలు అడగనంత మాత్రాన వారి గౌరవానికి తగ్గట్టు పెళ్ళి జరిపించాలని నా అభిలాష.

నెల రోజుల తర్వాత ఓసారి కనిపించమన్నాడుగా దయానిధి ఓసారి వెళ్ళి చూస్తే బాగుంటుందనిపించి పొద్దున్నే వెళ్ళాను.

ఎప్పటిలా కాఫీ టిఫిన్‌లతో సత్కరించాడు దయానిధి.

ఇంతలో మిల్లు తాళాలు తీసుకెళ్ళడంకోసం గుమాస్తావచ్చాడు.

ఆయన్ని చూస్తూనే ''గుమాస్తాగారూ బ్యాంక్ బాలెన్స్ ఎంత ఉంది? అర్జెంటుగా ఐదువేలు కావాలి. మన విశ్వనాథానికి ఇస్తానని మాటిచ్చాను'' అన్నాడు.

నా నోటినుంచి అడిగించకుండానే వ్యవహారం నడుపుతున్నందుకు నాకు ఎంతో సంతోషం వేసింది.

''పదిహేనువందలు మించి ఉండదండీ... అందులో ఐదువందలు మినిమం బాలెన్స్ ఉంచాలి'' అన్నాడు గుమాస్తా.

''అదేమిటండీ అంత తక్కువ ఎలా ఉంది? కిందటి వారంలో ఎన్నో చెక్కులు జమవేసాం కూడాను'' అన్నాడు దయానిధి ఆశ్చర్యంగా.

''నిజమే వాటిలో చాలావరకూ డిజానర్ అయ్యాయి. ఇంకా కొన్ని క్లియరై రాలేదు.''

''ఊ... చూసావుటోయ్ విశ్వనాథం... ఇలా ఏడుస్తాయి మా వ్యాపారాలు. అందరూ మేము లక్షలు పోసుకు కూర్చున్నామనుకుంటారు. అయినా నీకింకా ఓ నెలరోజులు టైముందికదూ'' అంటుండగా ఎవరో నలుగురు వచ్చారు.

వాళ్ళని చూడగానే ''రండి రండి'' అంటూ ఎదురువెళ్ళి తీసుకువచ్చి కూర్చోబెట్టి కాఫీలు, టిఫిన్లు ఇచ్చి మర్యాద చేసాడు దయానిధి.

''ముందు మిల్లుకివచ్చే మిమ్మల్ని కలుసుకుందామనుకున్నాం. కానీ అక్కడ ఫ్రీగా ఉండరని ఇక్కడికి వచ్చాం. ఏమనుకోకండి'' అన్నాడు ఒకాయన.

''ఎంతమాట... ఎంతమాట... చెప్పండి ఏమిటిలా వచ్చారు'' అన్నాడు దయానిధి వినయం ఒలకబోస్తూ.

''ఏంలేదండి మా కమర్షియల్ టాక్స్ స్టాఫ్ అసోసియేషన్ సర్కిల్ కాన్ఫరెన్స్ జరగబోతోంది. దానికి మీవంటి వారి సహాయ సహకారాలు అవసరం. ఈ సందర్భంగా ఒక చక్కని సావనీర్ విడుదలచేస్తున్నాం. దానికి మీరు ఒక ఫుల్‌పేజీ అడ్వర్టయిజ్‌మెంట్ ఇయ్యాలి. కాదనకూడదు. ఎంతో

కాదులెండి ఐదువేలే'' అన్నాడింకో ఆయన.

''ఫుల్ పేజీ ఇచ్చేటంత పెద్దవాడినికాదు లెండి. మీరు వచ్చారు కనుక కాదనలేక ఓ ఒన్‌ఫోర్త్ పేజీ ఇస్తాను''అన్నాడు దయానిధి ఆముదం తాగినట్టు ముఖంపెట్టి.

''ఇంకా నయం... ఓ కాలమ్ ఇంచ్ ఇస్తామన్నారుకాదు. మీ దగ్గర ఫుల్ పేజీ కంటే తక్కువ తీసుకుంటే మాకే నామర్దా . దయానిధిగారి ధర్మగుణం లోకంలో అందరికీ తెలిసిందే'' అని దయానిధి సమాధానం కోసం ఎదురు చూడకుండా —''సుబ్బారావుగారూ మీరు ఐదువేలకి రసీదు రాయండి. ఆయనలాగే అంటారు'' అన్నాడు వెంటవచ్చిన వారిలో ఒకరితో.

దయానిధికి తప్పలేదు. ''కానీండి మీ మాటే కానీండి. పోస్ట్ డేటెడ్ చెక్ ఇస్తాను తీసుకోండి'' అన్నాడు.

''అమ్మమ్మ శుభమా అంటూ ముందుగా మీ దగ్గరకే వచ్చాం. ఇవాళే ప్రెస్‌లో పని మొదలవుతుంది. టైమ్ తక్కువ ఉంది. కాష్ అడ్వాన్స్‌గా ఇమ్మన్నాడు ప్రెస్ ఆయన . అందువల్ల కాష్ ఇయ్యండి'' అన్నాడు ఆయన.


''చాలా ఇబ్బందేనే... ఉండండి అనామతు మొత్తం కొంత ఉంది. అందులోంచి ఇస్తాను'' అంటూ లోపలికివెళ్ళి డబ్బు తీసుకువచ్చి ఇచ్చాడు. రిజర్వ్ బ్యాంక్‌నుంచి వచ్చిన కొత్త యాభై రూపాయల నోట్లకట్ట అది.

వాళ్ళు రసీదు ఇచ్చి థాంక్స్‌చెప్పి వెళ్ళిపోయారు.

వాళ్ళు అలువెళ్ళగానే తిట్ల దండకం అందుకున్నాడు దయానిధి.

''దొంగముండా కొడుకులు వాళ్ళబ్బ సొమ్ము దాచినట్టు దబాయించి తీసుకెళ్ళారు

ఆ వచ్చినాయన కమర్షియల్ టాక్స్ సెక్షన్ సూపరింటెండెంట్. దాంతో నోరు మూసుకుని చచ్చినట్టు ఇయ్యాల్సి వచ్చింది. ఇవ్వనంటే ఎందులోనో మెలికిపెట్టి నడ్డి



నిరిగేట్టు టాక్స్ వడ్డిస్తారు'' అన్నాడు.

నా విషయంలో డబ్బులేదని గుమాస్తాచే త అనిపించి ఇప్పుడు లోపట్నుంచి డబ్బుతెచ్చి ఇవ్వడం చూసి నా మనసు చివుక్కుమంది. ఇంక అతన్ని అడగకూడదనీ, వేరే ఎక్కడైనా ప్రయత్నం చేసుకోవాలనీ అనుకున్నాను. ఆఫ్టరాల్ ఐదువేలు ఇయ్యడం దయానిధికి చిల్లరపైసలతో సమానం. మిల్లులో కలెక్షన్లు ప్రతిరోజూ అంతకు ఎన్నోరెట్లు ఎక్కువగా ఉంటాయి.

నా మనసులోని భావం పసిగట్టాడు. ఎంతైనా దయానిధి అసాధ్యుడు.

''ఈ డబ్బు అనామతు ఖాతాలోది విశ్వనాథం. బ్యాంక్ బాలెన్స్‌లేదని గుమాస్తాగారు అనగానే దీన్ని నీకే ఇయ్యాలనుకున్నాను. ఇంతలో వీళ్ళొచ్చి తన్నుకుపోయారు. ఫర్వాలేదులే. నీకు ఇంకా నెలరోజులు టైముందిగా. ఈలోగా ఎలాగైనా సర్దుబాటు అవుతుంది. ఆ ధైర్యంతోనే వాళ్ళకిచ్చాను. చూసావుగా మొండిముండాకొడుకులు. పీకలమీద కూర్చుని ఎలా లాక్కెళ్ళారో. నీకు వెంటనే అత్యవసరంగా కావాలనుకో... ఇంట్లో ఆడవాళ్ళ దగ్గరనుంచి ఏ నగోనట్రో తీసుకెళ్ళి తాకట్టుపెట్టు. బయట ఎవరిదైనా కాళ్ళో గడ్డమో పట్టుకుని డబ్బు తేగలను. నా చిన్ననాటి స్నేహితుడి కోసం ఆమాత్రం చేయడానికి నేనేమీ భయపడను. కాకపోతే ఇంకా టైం ఉందిగా. అందుకే కంగారుపడడంలేదు. నీకు అనిపించవచ్చు. లక్షాధికారి దయానిధికి ఐదువేలు కరవైందా అని. మా వ్యాపారాలే అంత. అంకెలన్నీ కాగితాలమీదనే ఉంటాయి. ఒక్కోసారి లక్షలు లక్షలు కుప్పలుగా వచ్చి పడతాయి. మరోసారి గట్టిగా ఐదువందలు కూడా దగ్గరుండవు. నువ్వేమీ దిగులుపడకు. నీకు ఇస్తానన్న తర్వాత ఇస్తాను. ఇంకా నెలరోజులు టైముంది కనుక ఓ ఇరవై రోజులుపోయాక ఎప్పుడైనా సరై వచ్చి తీసుకెళ్ళు. ఈలోపల అవసరమైన బట్టలు అదీ కాతామీద తెచ్చుకో. కావాలంటే నేను మాట చెప్తాను. అయినా ఊరందరి పిల్లలకి పాఠాలు చెప్పే పంతులివి. నీకు కాతాకోసం ఇంకొకరి రికమెండేషన్ ఎందుకోయ్?'' అంటూ ఉపన్యాసం దంచాడు దయానిధి.

నా తల తిరిగిపోయింది. తర్వాత కలుస్తానని చెప్పి లేచాను. 'అతను అన్నట్టు నాకు బట్టలషాపుల్లో కాతా పెట్టడం కష్టమేమీకాదు కాని మొదట్నుంచి కూడా నాకు అప్పు చేయడం ఇష్టం ఉండదు. అప్పు నిప్పులాంటిదని నా నమ్మకం. అప్పు అనగానే మనం లోకువైపోతాం. మనకు వాళ్ళేమీ తక్కువ ధరలు వేయరు. అంతో ఇంతో ఎక్కువేవేస్తారు. పైగా చులకనగా చూస్తారు. డబ్బు ఇచ్చి కొనేవాళ్ళకి ఇచ్చే గౌరవంకానీ, ప్రిఫరెన్స్ గానీ మనకి ఇవ్వరు. పొరపాటునో, విధిలేకనో ఆలస్యంచేస్తే వడ్డీకూడా పుచ్చుకుంటారు. కానీ వదిలిపెట్టరు. అందువల్ల ఉన్నదాంట్లో సర్దుకుపోతానేకాని ఎప్పుడూ ఎక్కడా అప్పుచేయను. ఆఖరికి మా ఆవిడకూడా ఓ గరిటెడు కాఫీపొడుంకో, ఓ గ్లాసుడు పంచదారకో ఇరుగింటికీ, పొరుగింటికీ ఎప్పుడూ వెళ్ళిందికాదు. గుట్టుగా, గుంభనంగా సంసారం నడుపుకుంటున్నాం. అప్పుచేయడం మొదలుపెట్టామంటే అది అలవాటైపో

తుంది. అడ్డూ, అదుపూ లేకుండా అది అలాఅలా పెరిగిపోతుంది. సరే దయానిధి అన్నట్టు ఇంకా నెలరోజులు పైముందిగా. అప్పటికి ఎలాగైనా ఇయ్యకపోడు. ఈలోగా ఉన్నడబ్బుతో ముందు మిగిలినవాటికి ఖర్చు పెట్టుకుంటే ఆ తర్వాత చివర చివరకి అత్యవసరంగా వచ్చే ఖర్చులకోసం అతనిచ్చే డబ్బు ఉంచుకోవచ్చు' అనుకుని దయానిధి మీద నమ్మకం ఉంచి మిగిలిన పనులు చూసుకోసాగాను.

పెళ్ళి ఇంక వారమే ఉంది. ఎంత జాగ్రత్తగా లెక్కలువేసినా అంచనాలన్నీ తప్పిపోతున్నాయి. తెచ్చిన డబ్బం ఖర్చయిపోయింది. దయానిధి ఇస్తానన్న ఐదువేలు కాకుండా కనీసం ఇంకో ఐదువేలైనా అవసర పడ్తాయేమోననిపిస్తుంది.

ఆ రోజు పొద్దున్నే దయానిధి ఇంటికి వెళ్ళాను.

"రా రా ఏమిటి ఇంకా రాలేదు. డబ్బేమైనా సర్దుబాటు అయిందా ఏమిటి అనుకుంటున్నాను" అంటూ రిసీవ్ చేసుకుని షరా మామూలుగానే "అమ్మాయ్. ..విశ్వనాథం బాబాయికి టిఫినూ కాఫీ పట్రా" అన్నాడు.

"ఎందుకు దయానిధి వచ్చినప్పుడల్లా ఇవన్నీ" అన్నాను.

అతను నా కోసం ఎదురుచూస్తున్నాడని తెలిసి ఆనందించాను. డబ్బు సమకూరబోతున్నందుకు హమ్మయ్య అనుకుని ఊపిరి తీసుకున్నాను. తప్పనిసరి అయితేనే ఆ మరో ఐదువేలు కూడా అతనినే అడగాలనుకున్నాను.

ఇంతలో ఓ కుర్రాడు వచ్చాడు. 18 ఏళ్ళు ఉంటాయి. చురుకైన కళ్ళతో అతని ముఖం కళకళలాడుతోంది. కాని ముఖంలో ఏదో దిగులు స్పష్టంగా కనిపిస్తోంది. వస్తున్నవాడు నన్నుచూసి రెండడుగులు వెనక్కివేసాడు.

అడుగుల చప్పుడు విని నా వంక తిరిగి మాట్లాడుతున్నవాడల్లా "ఎవరిది" అని అరిచాడు.

ఆ అబ్బాయి లోపలికివచ్చి "నమస్కారం సార్" అని ఆ తర్వాత నాక్కూడా నమస్కారం చేసాడు. అతను నాకు నమ



స్కారం పెట్టడమేమిటా అనుకున్నాను. కొంచెం పరకాయించి చూస్తే ఎక్కడో చూసిన ముఖంలా అనిపించింది. కాని ఎవరైందీ గుర్తుకి రావడంలేదు.

"ఎవరు నువ్వు? ఏంకావాలి?" అని అడిగాడు దయానిధి.

"సార్ నా పేరు శంకర్రావు. ఇంటర్ ఫస్టుక్లాస్‌లో డిస్టింక్షన్‌లో పాసయ్యాను. బిఎస్సికి అప్లయ్ చేసాను. సీటు వచ్చింది కాని ఫీజు కట్టడానికి డబ్బులేదు. నాకు చదువుకుని పైకి రావాలని ఎంతో కోరిక. దయచేసి నాకు సహాయం చేసి చదివించండి సార్" అన్నాడు దీనంగా.

"ఇది మరీ బాగుందయ్యోయ్! దానధర్మాలు చేయడానికి నేనేమైనా రాసులు పోసుక్కూర్చున్నాననుకున్నావా? అసలు నా దగ్గరికి వెళ్ళమని ఎవరు చెప్పారు.?" అన్నాడు దయానిధి వస్తున్న కోపాన్ని అణచుకుంటూ.

"ఎవరూ చెప్పలేదుసార్. గుళ్ళో నవగ్రహాలు ప్రతిష్టించినట్టు, సత్రంలో గదులు కట్టించినట్టు, గోడలమీద శిలాఫలకాలు చూసాను. మొన్న మీరు వేలమందికి అన్నదానం చేయడం, బట్టలు ఇయ్యడం కూడా చూసాను. పేరుకి తగ్గట్టు మీరు ఎంతో దయాగుణం కలవారని అర్థం చేసుకున్నాను. అందుకే 'మీరు తప్పక సహాయం చేస్తారని కొండంత ఆశతో వచ్చాను" అన్నాడు ఆ అబ్బాయి.

"బాగుందయ్యా నీ వరస. దానమో ధర్మమో అంటే రూపాయి రెండు వేస్తారు. అంతేకాని వందలూ వేలూ ఎవరు గుమ్మరిస్తారు. అడగడానికేనా అర్థం ఉండద్దు" అని గద్దించాడు దయానిధి.

"సార్ నేను ఊరికే ధర్మం చేయండని అడగడంలేదు. అప్పుగా సహాయం చేయండి. నాకు ఉద్యోగం వచ్చాక వడ్డీతో తీర్చుకుంటాను"

"ఇది మరీ బాగుందయ్యోయ్. నీ మాటలు వింటుంటే నాకు కోపం వస్తోంది, నవ్వు వస్తోంది. నువ్వు అమాయకుడవనీ తెలియడంలేదు. జాణవో తెలియడంలేదు. ఏం చూసి నీకు అప్పు ఇమ్మంటావు?"

"నా గురించి ఈ మాస్టార్ని అడగండి సార్. నేను వారి దగ్గర చదువుకున్నాను. నేను పేదవాడినేకాని నిజాయితీ ఉన్నవాడిని సార్" అన్నాడు నన్ను చూపిస్తూ. ఆ తర్వాత నాతో "మాస్టారూ నన్ను గుర్తుపట్టలేదా. మీ దగ్గరే టెన్త్ చదివాను. సైన్స్‌లో ఒకసారి స్పెషల్ ఫీజు, టెన్త్‌లో ఎగ్జామ్ ఫీజు నేను టైములోపల కట్టలేకపోతే మీరే కట్టారు" అన్నాడు.

అప్పుడు నాకు జ్ఞాపకం వచ్చింది. శంకర్రావు చెప్పిందంతా నిజమే. ఆ ఫీజులు నేను కట్టిన మాట నిజమే. అతను మంచి తెలివైన కుర్రవాడు. ఎప్పుడూ క్లాసులో ఫస్ట్ వచ్చేవాడు. ఎంతో కష్టపడి చదివేవాడు. కాకీనిక్కరు, చిరుగుల చొక్కా వేసుకువచ్చేవాడు. అప్పుడు పొట్టిగా ఉండేవాడు. ఇప్పుడు బాగా పొడుగయ్యాడు. అందుకే వెంటనే గుర్తు పట్టలేకపోయాను. నిజంగానే అతను ఎంతో నిజాయితీ పరుడు. నేను కట్టిన డబ్బులు కూడా నెమ్మది నెమ్మదిగా నేను అడక్కుండానే మొత్తం ఇచ్చేసాడు.

''నువ్వటోయ్ శంకరరావు, చాలా ఏళ్ళు యిందిగా వెంటనే గుర్తుపట్టలేకపోయాను. అయితే ఇంటర్ అయిపోయిందన్నమాట'' అన్నాను.

''బాగుంది మా విశ్వనాథం శిష్యుడివన్న మాట. సరే నేను వ్యాపారస్థుడిని. అందువల్ల కొన్ని ప్రశ్నల్ని సూటిగా అడుగుతాను. అవి కొంత కఠినంగా ఉండవచ్చు. మా విశ్వనాథం ముఖం చూసి నీకు ఎంతోకొంత సహాయం చేసి చదువు చెప్పించానే అనుకో. నువ్వు ఉద్యోగం చేసి నిజంగానే నా బాకీ తీరుస్తావనే అనుకుందాం. కానీ మాటవరసకి ఈలోగా నీకేమైనా అయిందనుకో. అంతటితో నా బాకీ సున్నా చుట్టినట్టేగా'' అన్నాడు దయానిధి.

అతను అంత కటువుగా మాట్లాడేసరికి నా మనస్సు చివుక్కుమంది. గుండెల్లో ఎవరో చేయిపెట్టి కెలికినట్టయింది.

శంకరరావు ముఖంలో బాధ కనిపించింది. ఒక్కక్షణం ఆలోచించాడు.

''సార్ మీరు పెద్దలు. నాకు తోచింది చెప్తాను. మరోలా అనుకోకండి. మీరు చేస్తున్నది వ్యాపారం. వ్యాపారం అన్న తర్వాత రిస్కులు ఎప్పుడూ ఉంటుంది. నేను బ్రతికుండి మీకు నిజాయితీగా వడ్డీతోసహా ఇచ్చేసాననుకోండి. ఆ వడ్డీ మీకు లాభం. అదికాకుండా మీరన్నట్టు అర్ధాయుష్యుతో చచ్చాననుకోండి. అది మీకు నష్టమే. అయితే రిటరన్ గ్యారంటీ లేని వ్యాపారం చేయాలని అనుకోను. అందువల్ల మీకు రిస్కు లేకుండానూ, నా అవసరం గడిచేట్టుగానూ ఉండే పద్ధతి ఒకటి చెప్తాను. మీరు నా చదువుకయ్యే మొత్తానికి నా పేరున ఒక ఇన్సూరెన్స్ పాలసీ తీయండి. దాని ప్రీమియం కూడా మీరే కడ్తుండండి. ఆ పాలసీలో నామినీగా మీ పేరు రాస్తాను. నేను చచ్చిపోతే ఆ మొత్తం బోనస్‌తో సహా మీకు వస్తుంది. బ్రతికి ఉన్నాననుకోండి. మీరు కట్టిన ప్రీమియం డబ్బుని వడ్డీతో సహా మీకు తీర్చి నామినేషన్ మార్చుకుంటాను'' అన్నాడు



శంకరరావు.

అతని సమాధానానికి ముగ్ధుడనై 'శభాష్' అనుకున్నాను మనసులోనే.

అయితే దయానిధి మాత్రం తెల్లబోయాడు. కొంచెం తెప్పరిల్లాక "అబ్బో చాలా తెలివితేలున్నాయి నీకు. నీ ముందు మేం చాలం వెళ్ళు బాబు... వెళ్ళు. ఈ సహాయం చేసే ఓపికా, లెక్కలు చూసుకునే తీరిక నాకు లేవు. నా వ్యవహారాలలో నేను మునిగితేల్తుంటాను" అన్నాడు దయానిధి.

"అలా అనకండి సార్ — మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను. నా నిజాయితీ గురించి మాస్టారు నడగండిసార్" అని బ్రతిమలాడసాగాడు శంకరరావు నేనేమైనా రికమెండ్ చేస్తానేమోనన్న ఆశతో నా వంక చూస్తూ.

నేనా సహాయంకోసం వచ్చాను దయానిధి దగ్గరికి. అటువంటిది నేనేమి రికమెండ్ చేయగలను. నా అశక్తతకి నాకే అసహ్యం వేసింది. సిగ్గుతో తలదించుకున్నాను. శంకరరావు ముఖంలోకి చూడలేకపోయాను. శంకరరావు మంచివాడు. సహాయం చేయవచ్చు అని అందామనిపించింది. అలా అన్నానంటే దయానిధికి నామీద కోపంవచ్చి నాకు ఇస్తానన్నదే ఇయ్యకపోతే నేను నిష్కారణంగా మునిగిపోతాను. అందువల్ల నోరు పెగల్చలేకపోయాను.

"ఇంకా ఉన్నావే... వెళ్ళు వెళ్ళు... నేను మిల్లుకి వెళ్ళాలి" అంటూ లేచాడు దయానిధి.

శంకరరావు ఇంకేమీ అనలేక దీనంగా నావంక ఓసారి చూసి తిరిగి వెళ్ళిపోయాడు.

ఆ చూపు నన్ను బాకుతో పొడిచినట్టనిపించింది.

దూరంగాపోయి బిగ్గరగా ఏడవాలనిపించింది.

శంకరరావుని అక్కునచేర్చుకుని నా అశక్తత తెలియజెప్పి ఓదార్చాలనిపించింది.

"చూసావా నీ శిష్యుడికెన్ని తెలివితేటలో. నాకే పాఠాలు నేర్పాలనుకున్నాడు. ఇటువంటివాళ్ళకి సహాయం చేస్తే రేపు మనల్నే ముంచేస్తారు" అన్నాడు దయానిధి.

"శంకరరావు అలాంటివాడు కాదు. చాలా మంచివాడు. ఎంతో నిజాయితీపరుడు" అన్నాను ధైర్యంచేసి.

"అదెప్పుడో నీ దగ్గర చదువుకున్నప్పటి మాట. ఇప్పటికి ఎంతగా మారాడో?" అన్నాడు దయానిధి.

వేలికేస్తే కాలికి కాలికేస్తే వేలికి వేసే దయానిధికి ఇంకేం చెప్పగలను. ఏమి మాట్లాడకుండా ఉండిపోయాను.

దయానిధి ఏదో అనబోతుండగా ఒక స్వాములవారు, ఆయన వెనుక నలుగురు శిష్యులు వచ్చారు. అందరూ కాషాయి దుస్తుల్లోనే ఉన్నారు. ఆయన మా ఊరిలోనే రామానందాశ్రమం నడుపుతున్నారు. స్వామీ రఘురామానంద అని ఆయన పేరు. నిత్యమూ ఆశ్రమంలో పూజలు, భజనలు జరుగుతుంటాయి. ప్రతిఏడూ శ్రీరామనవమికి ఎంతో ఘనంగా తొమ్మిది రోజులు ఉత్సవాలు చేస్తాడు ఆయన. నేను వచ్చిన వేళ బాగాలేదు. ఎవరో ఒకళ్ళు వస్తున్నారనిపించింది.

స్వాములవారిని చూడగానే దయానిధి ఎదురెళ్ళి సాదరంగా లోనికి తీసుకువచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు. ఆయన కూర్చో గానే కాళ్ళముందు సాష్టాంగపడ్డాడు. ఆయన ఆశీర్వదించాక లేచి, ఎదుట చేతులు కట్టుకు ని నిలబడి "ఆజ్ఞ సెలవియ్యండి స్వామీ" అన్నాడు.

స్వాములవారు నవ్వుతూ "ఏమీ లేదు నాయనా శ్రీరామ నవమి ఉత్సవాల సంద ర్భంగా రాములవారికి బంగారు కిరీటం చేయించాలని నిర్ణయించాం. మీకు గుర్తుండే ఉంటుంది. దానికి మీ విరాళం... అలాగే సాలీనా మఠానికి మీరిచ్చే చందా వాటికోసం వచ్చాం" అన్నారు.

"చిత్తం" అంటూ లోనికివెళ్ళి వేయి నూట పదహార్లు తెచ్చి—

"ఇది రాములవారి కిరీటానికి నా విరాళం. నా సాలీన చందా వారంలోగా పంపుతాను. లేదా ఇప్పుడే కావాలంటే ఆ మూడువేలకి పోస్ట్‌డేటెడ్ చెక్ ఇస్తాను" అన్నాడు దయానిధి.

"ఫర్వాలేదు నిదానంగానే ఇయ్యి నాయ నా" అంటూ స్వాములవారు ఆ డబ్బుని శిష్యులకందించి సెలవు తీసుకున్నారు. ఆ యన వెళ్ళాక "దీంతో ఇంట్లో ఉండిన అనామతు పైకం మొత్తం అయిపోయింది. అంతటి స్వాములవారు ఇంటికి వచ్చి అడిగితే వట్టి చేతులతో ఎలా పంపిస్తాను" అన్నాడు దయానిధి.

నేనేమీ మాట్లాడలేదు. అసహనంగా అటూ ఇటూ కదిలాను.


అది గమనించాడు దయానిధి.

"ఆ... ఇక నీ సంగతి పెళ్ళి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయా"? అన్నాడు

"ఆ... అయినట్టే చేతిలో చిల్లిగవ్వలేదు' 'అన్నాను.

"శుభమా అంటూ పెళ్ళిచేస్తూ అదేం మాట" అని కోప్పడి—

"చూడు విశ్వనాథం ఏమిటో ఎప్పుడూ రానివాడివివచ్చి నువ్వు అడుగుతున్నప్పుడే



డబ్బులేకుండాపోతోంది. నాకు రావలసిన డబ్బు రాకుండా బిగిసిపోయింది. కాస్తో కూస్తో ఉన్నా ఇదిగో చూస్తున్నావుగా ఇలాగే ఖర్చయిపోతోంది. నీకా వ్యవధిలేదు. ఎలాగైనా డబ్బు పుట్టించితీరాలి. పోనీ నీకోసం ఇంట్లో ఆడవాళ్ళ వంటిమీద నగలు తీసి తాకట్టు పెట్టాలనుకున్నాను. కాని ఇది శ్రావణమాసం. ఈ నెలలో వంటిమీద సొమ్ములు తీసుకోకూడదట. తాకట్టుమాట ఎత్తేసరికి కళ్ళనీరు పెట్టుకున్నారు. నాకు ఆ పిచ్చి నమ్మకాలు లేవనుకో. కాని ఆడవాళ్ళ సెంటిమెంట్‌ను ఎలా కాదనగలం? నువ్వే చెప్పు''అన్నాడు.

దయానిధి మాటలు వింటుంటే నా కాళ్ళకింద నేల కుంగిపోతున్నట్లనిపించింది. నమ్మించి నట్టేట్లో ముంచేసాడని బాధపడ్డాను.

మళ్ళీ మొదలుపెట్టాడు దయానిధి.

''నువ్వు దిగులుపడకు విశ్వనాథం. ఇది పెళ్ళి వ్యవహారమా? మరోటా?

ఇంట్లో ఆడవాళ్లు ఇయ్యనంత మాత్రాన ఊరుకుంటానా? నా స్నేహితుడు ఒకతన్ని అడిగాను. అతను వడ్డీ వ్యాపారం చేస్తాడు. అయితే అతనికి స్నేహం స్నేహమే. వ్యాపారం వ్యాపారమే. అందరికీ నెలకి నూటికి పది రూపాయల వడ్డీ తీసుకుంటాడు. నీకోసం నెలకి ఐదు రూపాయలకి ఒప్పించాను. ప్రోనోటు రాసిచ్చి ఎప్పుడు కావలసివస్తే అప్పుడు తీసుకువెళ్ళమన్నాడు. వ్యాపారం అన్న తర్వాత కాగితాలు, రాతకోతలు తప్పవుగా'' అంటూ ఓ ప్రోనోటు కాగితం తీసాడు.

నేను అవాక్కయిపోయి ఆ నోటువంకే చూస్తుండిపోయాను.

''వడ్డీ అని నువ్వేమీ దిగులుపడకు విశ్వనాథం. వ్యవధిలేదోయ్. ముందు పెళ్ళి సలక్షణంగా పూర్తి అవ్వాలిగా. అందుకే తప్పనిసరి అయి తెస్తున్నాను. నాచేతిలో పైసలు రాగానే ఆ డబ్బు మొత్తం నేనే అతనికిచ్చేసి ఈ నోటు చింపేస్తాను. అప్పటి వరకు ఐదువేలకీ నెలనెలా రెండొందల యాభై రూపాయలు కడుతూ ఉండు. బాకీ పూర్తిగా తీర్చేటప్పుడు కాస్తోకూస్తో వడ్డీ తగ్గించే ఏర్పాటుచేస్తాలే'' అంటూ ఏదేదో చెప్పుకుపోతున్నాడు దయానిధి.

ఆ మాటలు నా చెవికి ఎక్కడంలేదు. అప్పుడే నాకు పూర్తిగా జ్ఞానోదయం అయింది. దయానిధి నిజరూపం వికటాట్టహాసం చేస్తూ నా కళ్ళముందు నిలబడింది. చిన్ననాటి స్నేహితుడిని కనుక నా దగ్గర వడ్డీ అడగలేదు. అలాగని నరనరానా వ్యాపార తత్వం జీర్ణించిన అతను ఎలాగోలాగ నా దగ్గర వడ్డీ తీసుకోకుండా ఉండలేదు. అందుకే ఇంత నాటకం ఆడాడు. పబ్లిసిటీ కోసం తద్వారా పరపతే వ్యాపారం పెంచుకోవడంకోసం గుళ్ళలోనూ, సత్రాలలోనూ విగ్రహ ప్రతిష్ఠలు, గదుల నిర్మాణం చేయిస్తాడు. చివరికి పేదలకిచ్చిన బనీన్లమీదకూడా 'దయానిధి ధర్మం' అని రాయిస్తాడు. ఖర్చు ఎక్కువ అవుతోందని వాటిమీద తండ్రి పేరు కూడా రాయించడు. అన్నదానం, వస్త్రదానం పేరుతో వేలకువేలు ఖర్చుపెట్టాడు కాని డొక్కలు ఎండిపోయిన ముసలి ముష్టివాడికి ఎంగిలిమెతుకులు కూడా విసర

డు. కమర్షియల్ టాక్స్, ఇన్‌కంటాక్స్ వాళ్ళువచ్చి ముక్కుపిండి వసూలుచేస్తే వేలు గుమ్మరిస్తాడు. అందుకు బదులుగా నాల్గైదురెట్లు రాయితీలు పొందుతాడు. కాని నిజాయితీపరుడైన పేదవిద్యార్థి సహాయానికి వస్తే చీదరించి పంపుతాడు. కాని స్వాముల వారు వస్తే చీదరించి పంపగలడా? ఎందుకంటే చేసిన పాపాలను రద్దుచేయడానికి పరలోకంలో పుణ్యంకావాలిగా.

తలపైకెత్తి చూసాను. దూలానికి వేలాడుతున్న సాలెగూడులోకి ఈగవచ్చి ఇరుక్కుంది. దానినుంచి బయటపడడానికి బాధగా భయంకరంగా శబ్దంచేస్తూ గింజుకుంటోంది. బయటపడాలని ప్రయత్నం చేసినకొద్దీ మరింత బిగుసుకుపోతోంది. గూటిలో ఈగ చిక్కుపడడంచూసి సాలీడు పరుగున దగ్గరకు వచ్చింది. ఈ కొట్టుకోవడం చూసి ఆనందిస్తూ గూటిని ఉయ్యాలలాగ కదుపుతోంది. అది చూస్తుంటే నేను కూడా ఆ ఈగలాగ పద్మవ్యూహంలో చిక్కుకున్నానని పించింది. చాలా తెలివిగా నన్ను ఈ బోనులోకి ఇరికించాడు దయానిధి. ఇప్పుడు ఇంకో చోటికి వెళ్ళే వ్యవధికూడా లేదు. కనుక చచ్చినట్టు తన దగ్గరే తీసుకుంటానని అతనికి తెలుసు. అందుకే డబ్బు లేనట్టు నాటకం ఆడుతూ చివరిదాకా నాన్చాడు. నేను నిజాయితీగా బాకీ తీరుస్తానని తెలుసు. అందుకే ధైర్యంగా అప్పు ఇస్తూ వడ్డీకూడా గుంజుతున్నాడు.

"ఏమిటి విశ్వనాథం ఆలోచిస్తున్నావు? నీకిష్టమైతేనే సంతకంపెట్టు. లేకుంటే ఏం చేస్తాం"? అన్నాడు దయానిధి.

మళ్ళీ సాలెగూడు వంక చూసాను. కొట్టుకుని కొట్టుకుని ఈగ అలిసి నిలిచిపోయింది. ఉత్సాహంగా ఉరికి దాని దేహానికి కన్నంచేసి రక్తాన్ని పీల్చసాగింది సాలీడు.

నేను మారుమాట్లాడకుండా పెన్నుతీసి ప్రోనోటుమీద సంతకం చేసాను. అందులో ఏమి రాసిందీకూడా చూడకుండా. ఆ ప్రోనోటు మడిచి జేబులో పెట్టుకుంటూ "ఆనక మా గుమాస్తా చేత డబ్బు తెప్పించి మీ ఇంటికి పంపిస్తాను" అన్నాడు దయానిధి

*



## వీధిలైట్లు

"అబ్రహాం లింకన్ చిన్నప్పుడు వీధిలైట్ల క్రింద చదువుకొని అంతటి గొప్పవాడయ్యాడు..." చెప్పసాగాడు సోషల్ మాస్టారు క్లాసులో.

"నాకు కూడా అంతటివాడివి కావాలని వుందికానీ, మా వీధిలో లైట్లు వెలగడంలేదండీ... చెప్పాడో కొంటె కుర్రాడు.

—తాడూరి. స్వాతి (మచిలీపట్నం)